క్లుప్తంగా

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ గొర్రెకుంట కట్ట మల్లన్న చెరువును గురువారం ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ పరిశీలించారు. నగరంలోని పలు ప్రాంతాలతో పాటు మండలంలోని ఆయా గ్రామాల నుంచి వినాయక విగ్రహాలను ప్రతీ ఏటా కట్టమల్లన్న చెరువులో నిమజ్జనం చేస్తున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిమజ్జన ఏర్పాట్లపై మామునూరు ఏసీపీ సతీష్‌బాబు, గీసుకొండ సీఐ రామకృష్ణతో డీసీపీ చెరువు వద్ద సమీక్షించారు.

లెర్నింగ్ లైసెన్స్‌ల పంపిణీ



రాయపర్తి : మండలంలోని సూర్యతండాలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందించిన డ్రైవింగ్ లెర్నింగ్ లైసెన్స్‌లను పంపిణీ చేసినట్లు బీఆర్ఎస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు గుగులోత్ జాజు నాయక్ తెలిపారు. సర్పంచ్ మూనావత్ అమ్మి మాంజ్యానాయక్, ఎంపీటీసీ వెంకన్న నాయక్‌తో కలిసి లైసెన్స్‌లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో నారాయణ నాయక్, శంకర్ నాయక్, కిషన్, భిక్షపతి, పూల్ సింగ్, వెంకన్న, దేవేందర్, మాంజ్యా, రాజు తదితరులు పాల్గొన్నారు.

నియామకం



గడ్డం కిష్టయ్య

వర్ధన్నపేట : మండలంలోని దమ్మన్నపేటకు చెందిన గడ్డం కిష్టయ్యను తెలంగాణ అంబేడ్కర్ సంఘం(టీఏఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కిష్టయ్య మాట్లాడుతూ.. అంబేడ్కర్ భావజాలంతో దళితులను చైతన్యం చేసి వారి ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవడంతో పాటు సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అంబేడ్కర్ ఆశయాలతో ముందుకు సాగుతూ తనపై ఎంతో నమ్మకం పెట్టుకుని ఈ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేడ్కర్ యువజన కమిటీ ఎన్నిక

రాయపర్తి : మండలంలోని సన్నూరులో అంబేడ్కర్ యువజన సంఘం కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్నపాక యాకస్వామి, ఉపాధ్యక్షుడిగా చిన్నపాక జ్యోతిబసు, ప్రధాన కార్యదర్శిగా వంగాల మోహన్, కోశాధికారిగా చిన్నపాక సాయిరాంను ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు చిన్నపాక యాకయ్య, ఎల్లయ్య, ఐలయ్య, సుధీర్, సురేష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

రాయపర్తి : ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావును గురువారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు బంజారా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డి.దర్గయ్య తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావుకు మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపామన్నారు. ఉద్యమకారులు జయరాజ్, సుధాకర్ ఉన్నారు.

పరామర్శ

నల్లబెల్లి : మండలంలోని మామిండ్లవీరయ్యపల్లి, ముచ్చింపుల గ్రామాలకు చెందిన గొటుకుల చంద్రయ్య, పసుల సారమ్మ గురువారం మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ఎంపీపీ ఊడుగుల సునీతతో కలిసి జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న పరామర్శించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ గందె శ్రీలత, సర్పంచ్‌లు మామిండ్ల అమరేందర్, గొనె శ్రీదేవి, బొట్ల సువర్ణ, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

సంగెం : ఈ–పాస్ మిషన్‌లో స్టాకు, షాపులో ఉన్న ఎరువుల నిల్వలు సమానంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి చాట్ల యాకయ్య అన్నారు. గురువారం సంగెం రైతు వేదికలో మండల పరిధిలోని ఎరువులు, పురుగుల మందుల డీలర్లు, డీసీఎంఎస్, ఆగ్రోస్, సొసైటీ సీఈఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలర్లు నిబంధనలు పాటించాలన్నారు.

చర్య తీసుకోవాలి

చెన్నారావుపేట : రజక, నాయీబ్రాహ్మణ వృత్తి చేస్తున్న ఇతర కులస్తులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రజక కుల పెద్ద చాపర్తి రాజు, నాయీబ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం రజకులకు, నాయీబ్రాహ్మణలకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించి ఆదుకుందన్నారు. కానీ ఇతర కులస్తులు ధోబీ ఘాట్లు, సెలూన్లు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోకుండా 250 యూనిట్లు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం రజకులకు, నాయీబ్రాహ్మణ వృత్తిదారులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆదుకోవాలన్నారు. ఎడ్ల మల్లయ్య, మర్రి రమేశ్, ఎడ్ల కుమారస్వామి, మర్రి మధుకర్, పున్నం యాకయ్య, తదితరులు ఉన్నారు.

శ్మశానవాటిక స్థలం కాపాడండి



ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ కిషన్, తహసీల్దార్ కిరణ్‌కుమార్



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న ఖానాపురం వాసులు

- మూడు గంటల పాటు రాస్తారోకో
- సీఐ, తహసీల్దార్ హామీతో ధర్నా విరమణ

ఖానాపురం : మండల కేంద్రం శివారులోని తుంగబంధం కాల్వ సమీపంలో ఆక్రమణకు గురైన శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని కోరుతూ ఖానాపురం గ్రామస్తులు తుంగబంధం కాల్వ వద్ద జాతీయ రహదారిపై గురువారం రాస్తారోకో చేపట్టారు. 50 ఏళ్లగా ఉన్న శ్మశాన వాటిక ఆక్రమణకు గురైన స్థలానికి హద్దులు ఏర్పాటు చేయాలని, ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఉన్నతాధికారులు వచ్చి పరిష్కారానికి హామీ ఇస్తేనే ధర్నా విరమిస్తామని రోడ్డుపై బైఠాయించారు. దీంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ధర్నాను విరమింపజేసే ప్రయత్నం చేశారు. అయినా ప్రజలు విరమించలేదు. దీంతో నర్సంపేట పట్టణ సీఐ రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని అధికారులను పిలిపించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమింపజేసి పక్కనే వంటావార్పు చేపట్టారు. అధికారులు ఎవరూ రాకపోవడంతో ఆగ్రహించిన ప్రజలు మళ్లీ రోడ్డెక్కి రాస్తారోకోకు దిగారు. ఆర్డీఓ, ఇతర అధికారులు వచ్చే వరకు ధర్నా విరమించబోమని రోడ్డుపై ఉండటంతో మరోసారి వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఎంపీపీ ప్రకాశ్‌రావు సంఘటన వద్దకు చేరి సమస్య పరిష్కారం చేసుకుందామని తెలిపారు. ఆర్ఐ సత్యనారాయణ, కార్యదర్శి సుప్రజను రాస్తారోకో వద్దకు పిలిపించారు. అయినా వినకపోవడంతో రూరల్ సీఐ పుల్యాల కిషన్ వచ్చి ప్రజలతో మాట్లాడి సమస్య తప్పకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తామని, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా విరమించాలని సూచించడంతో రాస్తారోకో విరమించారు. ధర్నా వద్దకు తహసీల్దార్ కిరణ్‌కుమార్, సీఐ కిషన్ ఇరువురు వచ్చి ప్రజలతో చర్చించారు. సమస్యను పూర్తిగా తెలుసుకుని ప్రజల వద్దనుంచి వినతి స్వీకరించారు. పాత స్థలంలో దహన సంస్కారాలు చేసుకోవాలని, ఆక్రమణకు గురైన స్థలంపై వివరాలు సేకరించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వెంటనే సర్వేయర్‌ను పంపి ప్రజల సమక్షంలోనే సర్వే చేయించారు. దీంతో ప్రజలు సీఐ, తహసీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తరాల శ్రీను, కామని శంకర్, మానెపల్లి సంపత్, శైలజ, వార్డు సభ్యుడు రాజు, సొసైటీ డైరెక్టర్ సాంబయ్య, తవుటు రమేష్, కృష్ణ, చెన్నూరి సత్యం, కనకాచారి, జగన్నాథం, ప్రసాద్, ఉపేంద్రచారి, యాకమ్మ, యాదమ్మ, లావణ్య, కిరణ్, తక్కళ్లపల్లి రమేష్, రాజశేఖర్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

రాయపర్తి : ఎర్రబెల్లి దయాకర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందించే కుట్టు మిషన్లతో శిక్షణ పొందిన మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని తిర్మలాయపల్లి, రాయపర్తి గ్రామాల్లో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అనేక ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ గజవెల్లి అనంతప్రసాద్, కుక్కల భాస్కర్, భద్రునాయక్, ఎంపీటీసీ ఐత రాంచందర్, ఉపసర్పంచ్ గుడి యుగేందర్‌రెడ్డి, ఏపీఎం కిరణ్‌కుమార్, సీసీలు పావణి, దేవేంద్ర, వీఓఏ హసీనా, డి యాదగిరి, రాము, ట్రైనర్లు బిర్రు రమాదేవి, గొడుగు స్వప్న, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



నర్సంపేట: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



వర్ధన్నపేటలో..

నర్సంపేట : పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి కేంద్ర ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కల్లెపల్లి ప్రణయ్‌దీప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో విద్యార్థి ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ మహా యుద్ధ ర్యాలీ నిర్వహించారు. నాయకులు మొగిలిచర్ల సందీప్, బొట్ల నరేష్, అల్వాల నరేష్, గుర్రం అజయ్, మార్త నాగరాజు, సిద్దు, సమ్మెట వర్షన్, యాకుబ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని రాస్తారోకో

వర్ధన్నపేట : ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రస్తుత పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం వర్ధన్నపేట కొత్త బస్టాండ్ వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో రోడ్డుకు ఇరువైపుల ట్రాఫిక్ నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆందోళనకారులను రోడ్డుపై నుంచి బలవంతంగా తొలగించి అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు మాట్లాడుతూ మాదిగ ఉపకులాల కోసం మంద కృష్ణ మాదిగ అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. వర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని దుయ్యబట్టారు. ఎస్సీ వర్గీకరణ చేయకుంటే బీజేపీని గల్లీ గల్లీల్లో అడ్డుకుంటామన్నారు. నాయకులు జన్ను మధుకర్, ఈర్ల కుమార్, తడుగుల విజయ్, మాసాని గోపాల్, చాతల్ల రమేశ్, మిట్టపల్లి రాధిక, ఇనుముల పూర్ణయ్య, తాళ్ల రమేశ్, కలకోట్ల గిరి, వశపాక కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరకాలలో కాబోయే ఎమ్మెల్యే కాపు బిడ్డే

- మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



అభివాదం చేస్తున్న మున్నూరుకాపులు

సంగెం : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుంచి కాబోయే ఎమ్మెల్యే బీసీ మున్నూరు కాపు బిడ్డే అని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి జోస్యం చెప్పారు. గురువారం మండలంలోని ఆశాలపల్లిలో మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 25 శాతం ఉన్న మున్నూరుకాపు కులస్తులందరు ఏక తాటిపైకి వచ్చి కులానికి చెందిన వ్యక్తిని గెలిపించుకోవాలన్నారు. ఒక్కొక్కరు 10 మందికి చెప్పి ఓట్లు వేయిస్తే 50వేల భారీ మెజారిటీతో కాపు బిడ్డ ఎమ్మెల్యేగా గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు కూడా మద్దతు పలుకుతున్నాయన్నారు. సమావేశానికి రాకుండా ఎమ్మెల్యే ధర్మారెడ్డి ఆపుతున్నారని కులంలో విబేధాలు సృష్టిస్తు దూరం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఏ పార్టీలో ఉన్న కులస్తుందరు ఒకటేనని మన కులస్తున్ని భారీ మెజారిటీ గెలిపించాలని పిలుపు నిచ్చారు.

సేవకుడిగా పనిచేస్తా..

పరకాల నియోజకవర్గ ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని డాక్టర్ కాళీప్రసాదరావు అన్నారు. ఒక అవకాశం ఇస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల అభ్యున్నతి, భవిష్యత్ మార్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మంద ఐలయ్య, మేడిపల్లి శోభన్ బాబు, గోదాసి చిన్న, ఎరుకల దివాకర్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

దుగ్గొండి : మండలంలోని పొనకల్‌లో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరం నిర్వహించారు. 65 పశువులకు గర్భకోశ వ్యాధులు ఉన్నట్లు గుర్తించి చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. నట్టల నివారణ మందులతో పాటు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశు వైద్యులు శారద, రామ్మోహన్, రాజేందర్, సురేష్, గబ్బార్, పశుమిత్రలు కుమారస్వామి, వెంకన్న, రాజుకుమార్, అక్బర్, పాష పాల్గొన్నారు.

స్వచ్ఛతపై ముగ్గుల పోటీ



గీసుకొండ : మండలంలోని మరియపురంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తడి, పొడి చెత్త సేకరణ, వేరు చేయడం, వర్మీ కంపోస్టు తయారీ తదితర విషయాలపై గురువారం సర్పంచ్ అల్లం బాల్‌రెడ్డి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ అంశంపై ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఉన్నతి కార్యక్రమం ద్వారా కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శి నల్లెల్ల స్వప్న, సెర్ప్ సీసీ సుజాత పాల్గొన్నారు. నల్లబెల్లి మండలంలోని కొండాపూర్‌లో పంచాయతీ కార్యదర్శి రజిత అవగాహన కల్పించారు.

ఆర్థికసాయం

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మద్దెల కృష్ణయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా మంత్రి ఆదేశాల మేరకు పరామర్శించి ఆర్థికసాయం అందించినట్లు జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, సర్పంచ్ లేతాకుల సుమతియాదవరెడ్డి తెలిపారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

వర్ధన్నపేట : దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎండీ షరీఫ్ అన్నారు. గురువారం కట్ర్యాలలో వికలాంగుల ఇంటింటి సర్వేలో భాగంగా గ్రామంలోని గడప గడపకు వెళ్లి దివ్యాంగుల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమానికి సెప్టెంబర్ 15న ఇల్లంద గ్రామం నుంచి ప్రారంభించామన్నారు. సర్వేలో భాగంగా కట్ర్యాలలో మండల అధ్యక్షుడు జిట్టబోయిన శ్రీనివాస్‌తో కలిసి ఇబ్బందులను తెలుసుకున్నామని అన్నారు. దివ్యాంగుల పరిష్కార సభ ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వికలాంగులు పడుతున్న ఇబ్బందులు ఎమ్మెల్యే అరూరి రమేష్ దృష్టికి సర్పంచ్ గుజ్జ సంపత్‌రెడ్డి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సర్వేలో గ్రామంలో బోదకాలు వ్యాధితో బాధపడుతున్న బండారి రాములు, చెంగల స్వరూప, ఇలికల భూలక్ష్మి, ఎలికట్టె యాకమ్మలను గుర్తించారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు



నర్సంపేట: పూజలో పాల్గొన్న శివనగర్ భక్తులు



దుగ్గొండి: నాచినపల్లిలో..



ధర్మారంలో మట్టి విగ్రహానికి పూజ చేస్తున్న ఎలిగేటి రంజిత్‌- సరిత

నర్సంపేట : పట్టణంలోని పదో వార్డు పోచమ్మ దేవాలయంలో, 11వ వార్డు శివనగర్‌లో గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్ విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు.

నాచినపల్లిలో మహా అన్నదానం

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి కాపువాడలో నవయుగ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వినాయక మండపం వద్ద మహా అన్నదానం నిర్వహించారు. భక్తులు, క్లబ్ నిర్వాహకులు, అన్నదాతలు పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట : మండలంలో కొలువుదీరిన వినాయక విగ్రహాలకు భక్తులు పూజలు చేస్తున్నారు. వివిధ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గీసుకొండలో..

గీసుకొండ : మండల కేంద్రంలోని ఎల్లమ్మ దేవాలయంలో వినాయకచవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో గురువారం అన్నదానం నిర్వహించారు. మాజీ సర్పంచ్ కోల కుమారస్వామి అధ్యక్షతన చేపట్టిన కార్యక్రమంలో సీఐ రామకృష్ణ పాల్గొని భక్తులకు వడ్డించారు.

రాయపర్తి : మండలంలోని పెర్కవేడులో గడిమైసమ్మ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి గ్రామస్తులు, యూత్ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. బండి రాజేంద్రప్రసాద్, బొల్లం రాజు, అబ్బోజు పూర్ణాచారి, కోలుకొండ మధు, బండపెల్లి శ్రీనివాస్, నర్సింహాచారి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



రాయపర్తి: అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణమాసం నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవీలత తెలిపారు. ఈ సందర్భంగా తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించామన్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఎండీ యాకూబీ, ఆయా ఆర్.కనకతార, ఎల్లమ్మ, బుచ్చమ్మ, స్రవంతి, లావణ్య, రమ, గంగమ్మ, కళమ్మ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

చెన్నారావుపేట : గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. ఈ మేరకు మండలంలోని లింగగిరి, చెన్నారావుపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సీమంతాలు, అక్షరాభ్యాసం, అన్న ప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీటీసీ లక్ష్మి, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకాన్ని వినియోగించుకోవాలి



నల్లబెల్లి: లెంకాలపల్లిలో నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ సునీత



దుగ్గొండి: బిక్కాజిపల్లిలో.. ఎంపీపీ కోమల



పర్వతగిరిలో..

దుగ్గొండి : మండలంలోని బిక్కాజిపల్లిలో గృహలక్ష్మి పథకంలో భాగంగా మంజూరైన ఇంటి నిర్మాణ పనులను ఎంపీపీ కాట్ల కోమల గురువారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. గృహలక్ష్మి పథకంలో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించే ప్రతీ ఒక్కరికి ఇల్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతుబంధు జిల్లా డైరెక్టర్ కాట్ల భద్రయ్య, సర్పంచ్ సింగనబోయిన భాగ్యలక్ష్మి, లింగయ్య, ఎంపీటీసీ బండి జగన్, కన్నెబోయిన రమ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పనులు ప్రారంభం

పర్వతగిరి : గృహలక్ష్మి పథకాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల గ్రామ ఇన్‌చార్జ్‌లు చీమల భిక్షపతి, దర్శోజు దేవేందర్ అన్నారు. ఈ మేరకు మండలంలోని ఏబీతండాకు చెందిన భూక్యా సుశీలకు గృహలక్ష్మి పథకం కింద మంజూరైన ఇంటి నిర్మాణ పనులను గురువారం వారు ప్రారంభించారు. అనంతరం అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రమీలగోపి, ఉపసర్పంచ్ వెంకట్రాంరెడ్డి, సుభాషిణి, ఎంపీటీసీ వాసు, గ్రామ పార్టీ అధ్యక్షుడు భూక్యా వీరన్న, బాలు, విక్రమ్, సీనియర్ నాయకులు గుగులోత్ శివ, మోహన్, భద్రు, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు పూర్తి చేయాలి

నల్లబెల్లి : అర్హులైన పేదలకు గృహలక్ష్మి పథకం బిల్లులు సకాలంలో అందిస్తామని.. త్వరగా ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఎంపీపీ ఊడుగుల సునీత అన్నారు. మండలంలోని లెంకాలపల్లిలో గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీపీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహలక్ష్మి పథకంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ పనుల కోసం రూ.3 లక్షలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల లక్ష్మి, కొత్తపల్లి అశోక్, మామిండ్ల రాజు, కక్కెర్ల శ్రీనివాస్, గన్నెబోయిన చేరాలు, పప్పు శంకర్, గడ్డమీది సృజన, పోశాలు, గాదెం కొమురయ్య, కొమాండ్ల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

సంగెం : గ్రామంలో కుట్టు మిషన్ల పంపిణీ, శిక్షణపై సమాచారం లేకుండా తనను అవమానపరిచారని మండలంలోని కాపులకనిపర్తి సర్పంచ్ ఎర్రబెల్లి గోపాల్‌రావు గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ పేరుతో గ్రామంలో ఉచిత శిక్షణ అని చెప్పి సర్పంచ్, ఎంపీటీసీ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఒక్కో మహిళ వద్ద రూ.2,000 వసూలు చేశారన్నారు. లయన్స్ క్లబ్ పేరు చెప్పి తమ గ్రామస్తులను మోసం చేశారన్నారన్నారు. సర్పంచ్‌కు సమాచారం లేకుండా పంపిణీ కార్యక్రమానికి డీఆర్‌డీఓ సంపత్ రావు సైతం హాజరయ్యారని తెలిపారు. ఈ విషయంపై విచారణ చేసి బాధ్యులైన క్లబ్ ప్రతినిధిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతున్న యువతి మృతి



సవిత (ఫైల్)

నెక్కొండ : మండలంలోని కస్నా తండాకు చెందిన సలువాల సాంబయ్య కుమార్తె సవిత(20)కు రెండు నెలలుగా మానసిక స్థితి బాగోలేదు. దీంతో ఇంటర్ వరకు చదువుకున్న ఆమె ఇంటి వద్దే ఉంటుంది. మంగళవారం ఆమె తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా, ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూసే సరికి సవిత అపస్మారక స్థితిలో ఉంది. వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జానీపాషా తెలిపారు.


చికిత్స పొందుతున్న యువకుడు..

చెన్నారావుపేట : మండలంలోని జీడిగడ్డ తండాకు చెందిన భూక్యా సుమన్(28) కూలి చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై పనులకు వెళ్లకుండా ఉండటంతో భార్యభర్తల మధ్య గొడవ తలెత్తింది. దీంతో ఈ నెల 17న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. కాగా గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బెల్టుషాపు యజమానులపై కేసు

నర్సంపేట రూరల్ : అక్రమంగా మద్యం నిల్వ చేసిన బెల్టు షాపుల యజమానులపై గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు నర్సంపేట టౌన్ ఎస్సై శీలం రవి తెలిపారు. పట్టణంలోని సర్వాపురం శివారు మహబూబాబాద్ రోడ్డులో బెల్టు షాపు యజమానులు(చంద్రశేఖర్, కిశోర్) ఎలాంటి అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నారు. రూ.10వేల విలువ గల అక్రమ మద్యం కలిగి ఉండడంతో వాటిని సీజ్ చేసి ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



నల్లబెల్లి : మధ్యాహ్న భోజన కార్మికుల గౌరవ వేతనం, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఆవరణలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండుతున్న కార్మికులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో అప్పు తెచ్చి విద్యార్థులకు భోజనం వండి వడ్డిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కార్మికులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మక్క, సుజాత, రజిత, పూల, నిర్మల తదితరులు పాల్గొన్నారు.